క్లుప్తంగా

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర హౌసింగ్ శాఖ సెక్రటరీ



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న కలెక్టర్

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని మంగళవారం రాష్ట్ర హౌసింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన సేవలు ఏర్పాటు చేశారు. అనంతరం పండితులు ఆశీర్వచనాలు చేశారు. వీరితో పాటు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ఆయనకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు జీఎస్టీపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా కేంద్రంలో బుధవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీమోహన్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు యంత్రాల ప్రదర్శన, రైతులకు కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే 3వ తేదీన ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

తవణంపల్లె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ప్రజలు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రోగులకు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన రెడ్డిప్రసాద్

గుడిపాల: ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. వివరాలు.. బొమ్మసముద్రం రైల్వే గేట్ వద్ద పనిచేస్తున్న రెడ్డిప్రసాద్ విధులు ముగించుకుని మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా వస్తున్న ఏపీ26–ఏవై–7628 నంబరు కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూర్యప్రభవాహనంపై శ్రీవారు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని మహాలక్ష్మీ గోదాదేవి ఆంజనేయ స్వామి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా కాలభైరవ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

గ్యాంగ్ రేప్ నిందితులతో టీడీపీకి సంబంధం లేదు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో కలకలం రేపిన గ్యాంగ్ రేప్‌ను నిందితులను టీడీపీకి ఆపాదించారని, వారికీ, టీడీపీకి సంబంధం లేదని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గ్యాంగ్ రేప్ నిందితులు టీడీపీ వారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోషల్ మీడియాలో ప్రచారం చేశాయన్నారు. అది వాస్తవం కాదన్నారు. ఆ ఘటన గురించి తెలిసిన వెంటనే తాను ఎస్పీ, డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లానన్నారు. నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

లోకనాయకి.. కరుణించు తల్లీ..!



కోదండరామస్వామి ఆలయంలో రామావతారం



సాయిబాబా ఆలయంలో దుర్గాదేవి



దుర్గాదేవి అలంకరణలో పాలేటమ్మ

చిత్తూరు రూరల్(కాణిపాకం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో మంగళవారం దుర్గాష్టామి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేక పూజలు కొనసాగాయి. భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూకట్టారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి వివిధ రూపాల్లో దుర్గాదేవీ కొలువుదీరారు. గిరింపేటలో దుర్గాంబ పవళింపు సేవలో కటాక్షించారు. ఆలయ నిర్వాహకులు దిలీప్‌రెడ్డి, తిమ్మారెడ్డి తీర్థప్రసాదాలను వితరణ చేశారు. కట్టమంచి షిర్డీసాయిబాబా ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో అభయమిచ్చారు. కోదండరామస్వామి ఆలయంలోని స్వామివారు రామావతారంలో కనవిందు చేశారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక పాలేటమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్ గేటులో చాముండేశ్వరిదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు కటాక్షించారు.

మహిషాసురమర్దినిగా ..

బంగారుపాళెం: గ్రామదేవత ముత్యాలమ్మ, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు అభయ మిచ్చారు. అలాగే స్థానిక ఓంశక్తి ఆలయంలో అమ్మవారి మూల విగ్రహానికి విశేషపూజలు, అభిషేకాలు చేపట్టారు. మొగిలివెంకటగిరి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.





చాముండేశ్వరిదేవి, దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు, పానాటూరులో ముత్యాలమ్మ అమ్మవారు దుర్గాలమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు.

మాజీమంత్రి పెద్దిరెడ్డితో భేటీ



పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ధనుంజయరెడ్డి

యాదమరి: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని జెడ్పీ వైస్‌చైర్మన్ బి.ధనుంజయరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన యాదమరి జెడ్పీటీసీ మాజీ సభ్యులు కొనావల్లి మనోహర్‌తో కలసి హైదరాబాదులోని పెద్దిరెడ్డి నివాసంలో కలసి మండలంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. త్వరలోనే మండల పర్యటన చేస్తానని వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులను, అభిమానులను త్వరలోనే కలుస్తానని మాజీమంత్రి పెద్దిరెడ్డి చెప్పారన్నారు. కార్యక్రమంలో పూతలపట్టు నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది దాటుతున్నా హామీ అమలు చేయరా ?



మాట్లాడుతున్న శ్రీరాములు

చిత్తూరు కార్పొరేషన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీకి ఏడాది పైగా అవుతోందని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాములు అన్నారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం ఆ హామీ నెరవేర్చకుండా మాటతప్పారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి రూ.కోటి సంక్షేమ బోర్డుకు జమ చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చి, మాట తప్పారన్నారు. వెంటనే హామీలు నెరవేర్చకపోతే చలో విజయవాడ నిర్వహించి రాష్ట్ర కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కూటమి మొండి వైఖరి మార్చుకోవాలి



ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం పట్ల చూపుతున్న మొండి వైఖరి మార్చుకోవాలని ఫ్యాప్టో సంఘం రాష్ట్ర పరిశీలకులు నరోత్తమరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవో కార్యాలయంలో ఫ్యాప్టో సంఘం జిల్లా చైర్మన్ మణిగండన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ అక్టోబర్ 7న విజయవాడలో నిర్వహించనున్న ధర్నాలో టీచర్లు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వేలాది మంది టీచర్లతో రాష్ట్ర స్థాయిలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ మణిగండన్ మాట్లాడారు. ఆర్థిక బకాయిలను విడుదల చేయకుండా మీనమేషాలు లెక్కించడం దారుణమన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలన్నారు.

ఫ్రెండ్లీ ప్రభుత్వమంటూనే మోసం

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమంటూనే కూటమి ప్రభుత్వం మోసగిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మండిపడ్డారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అనే పేరుతో రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లకు కు చ్చు టోపీ పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంత్యక్రియల ఖర్చులు చెల్లించకపోవడం దారుణం

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్, మృతి చెందిన ఉద్యోగుల అంత్యక్రియల ఖర్చు లు చెల్లించకపోవడం దారుణమని ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ మునీర్ అహ్మద్ మండిపడ్డారు. ప్లస్ టూ పాఠశాలల్లో టీచర్ల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించలేకపోతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు రామమూర్తి, మదన్ మోహన్‌రెడ్డి, జగదీశ్, చిట్టిబాబు, ప్రభాకర్, రెడ్డెప్పనాయుడు, ముక్తార్ అహ్మద్, చంద్రన్ పాల్గొన్నారు.

మొగిలిలో కుంకుమార్చన



బంగారుపాళెం: మొగిలిలో లలితా సహస్ర నామ కుంకుమార్చన పూజలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలో మొగిలి స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం శ్రీకామాక్షమ్మ సన్నిధిలో లలితా సహస్రనామ కుంకుమార్చన పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మ వారికి పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం లలితా సహస్రనామ కుంకుమార్చనలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజులు, అర్చకులు పవన్‌గురుకుల్, హర్షవర్ధన్, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.